వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం

కలశాలను తీసుకొస్తున్న ఆలయ ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై15: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయంతో పాటు అనుబంధ పాతగుట్ట(పూర్వగిరి) ఆలయంలో సోమవారం స్వాతీనక్షత్రం పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతీనక్షత్రం సందర్భంగా వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం జరిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో 108 కలశాలను ఏర్పాటు చేసి గంగాది, సప్తనదీ జలాలు, మామిడి, తమలపాకులు, దర్భలు, పూలమాలలు, కొబ్బరికాయలతో అలంకరించారు. పంచామృతాలతో పాటు సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. ఆయా దేవతల మూలమంత్ర పఠనాలతో హోమ పూజలు నిర్వహించారు. ప్రధానాలయంలో కొలువుదీరిన స్వయంభూ పంచనారసింహస్వామి, సువర్ణప్రతిష్ఠా అలంకార మూర్తులను వేదమంత్రాలతో అష్టోత్తర శతఘటాభిషేక పూజలు నిర్వహించి సువర్ణపుష్పాలతో అర్చించారు. సాయంత్రం స్వామివారిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గిరిప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామివారిని మేల్కొలిపి తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం, నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. అనుబంధ రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్పటికలింగేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. సుమారు 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ. 17,50,276 ఆదాయం సమకూరిందని అనువంశికధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారిసేవలో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

మొక్క నాటుతున్న శైలజా రామయ్యార్

యాదగిరిగుట్ట : రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ స్వామివారి సేవలో పాల్గొని తరించారు. సోమవారం ఉదయం దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు, వైటీడీఏ వైస్‌చైర్మన్ కిషన్‌రావుతో కలిసి ఆమె ఆలయానికి చేరుకున్నారు. ముఖ మండపంలో ఆలయ ప్రధానార్చక బృందం వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికింది. అనంతరం వారు స్వయంభూ పంచనారసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. వారికి ఆలయ ప్రధానార్చకులు వేదాశీర్వచనం చేయగా ఈఓ భాస్కర్ రావు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందించారు. అనంతరం క్యూలైన్లు, ఎల్‌ఈడీ స్క్రీన్, సాంస్కృతిక మండపాన్ని ఆమె పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా ప్రొటోకాల్ కార్యాలయం ముందు మొక్కలు నాటారు. ఆమె వెంట ఆలయ అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ప్రధానార్చకుడు నల్లన్‌థీఘశ్ లక్ష్మీనరసింహాచార్యులు, ఏఈఓ గట్టు శ్రవణ్‌కుమార్, జూశెట్టి కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

మహదేవ్‌పూర్ గ్రామానికి బస్సు సౌకర్యం

బీబీనగర్, జూలై 15 : మండలంలోని మహదేవ్‌పూర్ గ్రామానికి ఆర్టీసీ అధికారులు బస్సు సౌకర్యాన్ని కల్పించారు. సోమవారం గ్రామానికి వచ్చిన బస్సుకు స్థానిక నాయకులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దండెం ప్రభాకర్, దేవరకొండ వేణుగోపాల్, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పాఠశాల అభివృద్ధికి దాతల చేయూత అభినందనీయం'

దాత అస్లామొద్దీన్‌ను అభినందిస్తున్న హెచ్ఎం శోభ

ఆలేరు రూరల్, జూలై 15 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల చేయూత అభినందనీయమని మండలంలోని కొలనుపాక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శోభ అన్నారు. పాఠశాల ప్రహరీతో పాటు గేటు పునరుద్ధరణకు ముందుకు వచ్చిన ఎస్ఏఎఫ్ తవక్కల్ ఫౌండేషన్ చైర్మన్ అస్లామొద్దీన్‌ను హెచ్ఎం, గ్రామస్తులు అభినందించారు. మాజీ సర్పంచ్ మోత్కూరి అయిలయ్య, ఉమర్, రమేశ్, రాజు, స్వామి, పరశురాములు, బాలనర్సయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

- మున్సిపల్ చైర్పర్సన్ విజయలక్ష్మి

మొక్క నాటి నీరు పోస్తున్న మున్సిపల్ చైర్పర్సన్ విజయలక్ష్మి

భూదాన్‌పోచంపల్లి, జూలై 15 : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ కోరారు. సోమవారం పట్టణ కేంద్రంలోని బుగ్గ రామన్న దేవాలయం రోడ్డులో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, వైస్‌చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్లు గుండు మధు, దేవరాయ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య

సమావేశంలో మాట్లాడుతున్న మేడి పాపయ్య

యాదగిరిగుట్ట, జూలై15: ఈ నెల 19న యాదగిరిగుట్ట పట్టణంలో జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణే ఏకైక లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ ముందుకు సాగుతుందని, ఈ నేపథ్యంలో నిర్వహించే మహాసభకు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిజాల గెలువయ్య, మంచాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు కూరెళ్ల రమేశ్, లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ డప్పు వీరస్వామి, నాయకులు బొట్ల శంకర్, భూషి మహేశ్, చిరంజీవి, బొట్ల శ్రీనివాస్, బైరపాక నాగరాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- తుర్కపల్లి మండల వైద్యాధికారి సుధీర్‌రెడ్డి

తుర్కపల్లి, జూలై15 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి సుధీర్‌రెడ్డి సూచించారు. మండలంలోని మాదాపురం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట సీహెచ్ఓ రాజయ్య, వైద్య, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి

- కలెక్టర్ హనుమంతు కె. జెండగే

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూలై15 :ప్రజల సమస్యలకు అధిక ప్రాధాన్యతనిచ్చి ప్రజావాణి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కె.జెండగే జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశంలో మాట్లాడారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజల సమస్యలను విని వాటికి పరిష్కార మార్గాలను చూపాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సోమవారం 65 ఫిర్యాదులు వచ్చాయని, అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 50, ఎస్సీ సంక్షేమశాఖ-2, మహిళా శిశు సంక్షేమ శాఖ- 3, వ్యవసాయశాఖ- 2, జిల్లా పరిషత్, పరిశ్రమల శాఖ, ఉపాధి కల్పన, సర్వే ల్యాండ్ రికార్డు, భువనగిరి మున్సిపాలిటీ, పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణంశాఖలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. బెన్‌షాలోమ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె. గంగాధర్, జడ్పీ సీఈఓ ఎన్. శోభారాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పార్థ సింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులపై నిర్బంధం అప్రజాస్వామికం

- బీఆర్ఎస్‌వీ మండల అధ్యక్షుడు బాల్‌సింగ్

పోలీసులు అరెస్ట్ చేసిన సంస్థాన్‌నారాయణపురం, పోచంపల్లి బీఆర్ఎస్వీ నాయకులు

బొమ్మలరామారం, జూలై 15 : సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులపై నిర్బంధం విధిస్తూ వారిని అరెస్టు చేయించడం అప్రజాస్వామికమని, దీనిని ప్రజాస్వామిక వాదులందరూ ఖండించాలని బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు ధీరావత్ బాల్‌సింగ్ అన్నారు. సోమవారం నిరుద్యోగుల చలో సెక్రటేరియల్ కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి బల్దేరిన నిరుద్యోగులను, బీఆర్ఎస్‌వీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ ప్రకటించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నదన్నారు. అరెస్ట్ చేసిన వారిలో బీఆర్ఎస్ యూత్ మండల ప్రధాన కార్యదర్శి మానుకరాజు, ఉపాధ్యక్షుడు బాదిని నిఖిల్ గౌడ్, అడిజెర్ల వెంకటేశ్, ధీరావత్ లక్ష్మణ్, మోతె మధు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు చిలువేరు శేఖర్, యువజన విభాగం నియోజవర్గ మాజీ అధ్యక్షుడు చింతకింది కిరణ్, బీఆర్ఎస్‌వై మండలాధ్యక్షుడు కలుకూరి శ్రీకాంత్, నాయకులు సిద్దుల ప్రభాకర్ ఉన్నారు.

సంస్థాన్‌నారాయణపురం: బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేశ్, సురేశ్‌లను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

మోత్కూరు : సచివాలయం ముట్టడికి వెళ్లకుండా పోలీసులు బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు కంచర్ల క్రాంతికుమార్‌రెడ్డిని అరెస్టు చేశారు.

అడ్డగూడూరు : మండలంలోని బీఆర్ఎస్వీ నాయకులు బాలెంల అరవింద్, గూడెపు నరేశ్, పయ్యావుల రమేశ్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

భూ నిర్వాసితులకు పరిహారం చెక్కుల అందజేత

బీబీనగర్, జూలై 15 : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామం మీదుగా నిర్మించిన బునాదిగాని కాల్వలో భూములు కోల్పోయిన బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రైతులు రామ్‌రెడ్డి, లక్ష్మి, సురేందర్‌రెడ్డికి మంజూరైన పరిహారం చెక్కులను సోమవారం కలెక్టర్ కార్యాలయంలో భూ సేకరణ అధికారి జగన్నాథరావు అందించారు. రైతులకు చెందిన 4 ఎకరాల భూమి ని ప్రభుత్వం తీసుకోగా పరిహారం కింద రూ.45 లక్షలు మంజూరైనట్లు అధికారి తెలిపారు.

రఘునాథపురం హైస్కూల్ అటెండర్ మృతి

రాజాపేట, జూలై 15 : మండలంలోని రఘునాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అటెండర్ ఎండీ నసీరొద్దీన్ సోమవారం ఆనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. పాఠశాలలో నసీరొద్దీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలని వినతి

ఆలేరు రూరల్, జూలై 31: మండలంలో ఉపాధిహామీ కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జూకంటి పౌల్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ సత్యానంద్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో బిల్లులు రాక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వలిగొండలో పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలి : సీపీఎం

రామన్నపేట(వలిగొండ), జూలై15: వలిగొండ పట్టణంలో మురుగు కాల్వలను శుభ్రం చేయక పోవడంతో దోమల బెడద అధికమైందని, కాల్వల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. సోమవారం వలిగొండ పట్టణంలోని వెల్వర్తి రోడ్డు నుంచి పాత తాసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో మురుగు కాల్వలను పరిశీలించి మాట్లాడారు. పట్టణంలో పారిశుధ్యం సరిగా లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకుడు కూర శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గర్దాసు నర్సింహా, నాయకులు కొండూరి సత్తయ్య, లక్ష్మయ్య, నరేందర్, కవిత, పర్విన్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

- డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోద

రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

ఆత్మకూరు(ఎం), జూలై 15 : వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన సేవలందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోద ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందితో సమావేశమై మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆమె వెంట చౌటుప్పల్ డివిజన్ ఆరోగ్య సిబ్బంది శిక్షకురాలు వసంతకుమారి, మండల వైద్యాధికారి విలియం కేరీ, సీహెచ్ఓ కర్ణాకర్ ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సాయికుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

ఆత్మకూరు(ఎం), జూలై 15 : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు మద్దెల సాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్న సాయికుమార్‌ను సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, లోడి శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

పిలాయిపల్లి రైస్‌మిల్లులో అధికారుల తనిఖీ

సాయి బాలాజీ రైస్ మిల్లును పరిశీలిస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 15 : మండలంలోని పిలాయిపల్లి గ్రామ శివారులోని సాయి బాలాజీ రైస్‌మిల్లులో వికారాబాద్ సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సుగుణబాయి సోమవారం తనిఖీ నిర్వహించారు. గత యాసంగి సీజన్లన్‌లో ప్రభుత్వానికి అందించాల్సిన ధాన్యం లెక్కలను ఆమె పరిశీలించారు. దీనిపై నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట ఓఎస్‌డీ కృష్ణ, తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ నర్సింహారెడ్డి, డీటీ బాలమణి ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

రాజాపేట, జూలై 15 : మండలంలోని రఘునాథపురం గ్రామానికి చెందిన తుంగ శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు (1989-90 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు) సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.16,700 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి

చందుపట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బొమ్మలరామారం, జూలై 15 : రెండు నుంచి మూడు సంవత్సరాలు నిండిన బాల బాలికలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి కోరారు. సోమవారం మండలంలోని మైలారం, యావాపూర్ గ్రామాల్లో అమ్మమాట అంగన్‌వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆట పాటల ద్వారా చదువు నేర్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుల్తానా, నాగమణి, హెచ్ఎం కృష్ణవేణి, సెక్రటరీ ప్రమీల, అశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ

భువనగిరి కలెక్టరేట్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో అమ్మమాట-అంగన్‌వాడీబాట పేరుతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు సాంబశివ, యాదగిరి, దశరథ, శ్రీను, నర్సిరెడ్డి అంగన్‌వాడీ టీచర్లు దంతూరి భాగ్యమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

రామన్నపేట(వలిగొండ): వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-3 ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సైదులు, అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, ఆగమ్మ, వెంకటేశ్వరమ్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాగులో ఉన్న రైతులకు పాస్‌పుస్తకాలు పంపిణీ చేయాలి

- తాసీల్దార్‌కు బాధిత రైతుల వినతి

తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

తభువనగిరి కలెక్టరేట్, జూలై 15 : మండలంలోని హన్మాపురం గ్రామంలో సర్వే నంబరు 87లో ఉన్న 15.12 ఎకరాల భూమిని 60 ఏండ్లుగా సాగు చేసుకుంటున్న 14 ఎస్సీ కుటుంబాలకు ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని హన్మాపురం గ్రామానికి చెందిన రైతులు, సింగిల్ విండో డైరెక్టర్ దయ్యాల నర్సింహ ఆధ్వర్యంలో తాసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందించారు. భూమిని సర్వే చేయించి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని, దానిని ఆక్రమించేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాగుదారులు ముడుగుల ఉపేందర్, బిచ్చాల మైసమ్మ, బిచ్చాల లక్ష్మయ్య, ఆండాలు, బండారి నరసింహ, ముడుగుల బంగారి, లింగమ్మ, సింగారం నరసమ్మ, ముడుగుల లింగయ్య, స్వామి, పెంటమ్మ, నరసమ్మ, రాజు, మహేశ్, బాల్‌నరసింహ, రాము, జనార్దన్, వెంకటయ్య, జీవన్, ఆంజనేయులు, సుధాకర్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు హరినాథ్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

మోటకొండూర్, జూలై 15 : ముదిరాజ్‌లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు కొల్పుల హరినాథ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ నెల 15 నుంచి 20 వరకు ఈ మేరకు వినతి పత్రాలను అందించాలని కోరుతూ రూపొందించిన వాల్ పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్ అభయ హస్తం, బీసీ -డీ నుంచి బీసీ- ఏలోకి మార్చే ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా మహిళా అధ్యక్షురాలు బోయిని ఝాన్సి, జిల్లా నాయకులు జోరుక ఎల్లేశ్, భువనగిరి ఎల్లయ్య, గిరబోయిన మల్కయ్య, మానెగల్ల విక్రమ్, మారబోయిన శ్రీనివాస్, పేరబోయిన కార్తీక్, రాగుల భిక్షపతి, చొప్పరి మారయ్య, భువనగిరి నర్సింగ్ పాల్గొన్నారు.

తాసీల్దార్‌కు వినతి

భూదాన్‌పోచంపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తాసీల్దార్ నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందించారు. అనంతరం స్థానిక నేతాజీ రస్తా వద్ద వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి శ్రీనివాస్, ఫిషరీస్ జిల్లా డైరెక్టర్ చెక్క వెంకటేశ్, సంఘం మండలాధ్యక్షుడు గుండ్ల భాస్కర్, నాయకులు జింకల యాదగిరి, పొనమోని సహదేవ్ , జింకల బసవయ్య పాల్గొన్నారు.

మూసీ కాల్వపై బ్రిడ్జి నిర్మించాలని ధర్నా

ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు(ఎం), జూలై15 : మండలంలోని కూరెళ్ల-రాఘవాపురం గ్రామాల మధ్య ఉన్న మూసీ కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం మాట్లాడుతూ గతంలో ఉన్న బ్రిడ్జి నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు యాదగిరి, వెంకటనర్సు, రాములు, యాదయ్య, అంజయ్య, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ బాధితులను ఆదుకోవాలని వినతి

తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

తుర్కపల్లి, జూలై15 : రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంతో భూములు కోల్పోతున్న మండలంలోని దత్తాయిపల్లి గ్రామస్తులకు బహిరంగ మార్కెట్ విలువ చెల్లించి ఆదుకోవాలని కోరుతూ బాధితులు సోమవారం తాసీల్దార్ దేశియాకు వినతిపత్రం అందించారు. గ్రామంలో తమకున్న ఎకరం, అరెకరం భూములు కూడా రోడ్డు నిర్మాణంలో పోతున్నాయని, దాంతో తాము ఆధారం కోల్పోతున్నామని వాపోయారు. తాము కోల్పోయిన భూమికి సమానంగా మరోచోట భూమిని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గిద్దె కర్ణాకర్, బాధితులు పాల్గొన్నారు.

కొత్త టెక్నాలజీతో పనిభారం తగ్గించుకోవచ్చు

- మున్సిపల్ చైర్మన్ రాజు

కొత్త సిస్టిమ్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

చౌటుప్పల్, జూలై 15 : ప్రస్తుత ఆధునిక సమాజంలో కొత్త టెక్నాలజీతో పనిభారం తగ్గించుకోవచ్చని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ఆటోమెటిక్ ఆన్ అండ్ ఆఫ్ సెన్సార్ బేస్డ్ పవర్ సేవర్ మోడ్ డివైజ్ సిస్టిమ్ ప్రాజెక్ట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విధానంతో క్షణంలో మొబైల్ ద్వారా సమస్యను గుర్తించి పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం చౌటుప్పల్ పట్టణకేంద్రంలోని బంగారిగడ్డ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్, డీఈ రాములు, వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, సీడీపీఓ శైలజ, వార్డు కౌన్సిలర్లు బాబాషరిఫ్, నాయకులు దండ అరుణ్ కుమార్, బొడిగే బాలకృష్ణగౌడ్, కానుగుల వెంకటయ్య పాల్గొన్నారు.

అదుపుతప్పి చెరువులో పడ్డ లారీ

చెరువులో మున